

# మనసారా నవ్వండి

ఈ ప్రపంచంలో కొన్ని వస్తువులని చూస్తే ఎంతో ఆశ్చర్యం వేస్తుంది. నాకలా అమితమైన ఆశ్చర్యం కలిగించిన వేమిటో చెప్పమంటారా ? పిల్లన గ్రోవి, చదరంగం బోర్డ్ ! చిత్రంగా ఉంది కదూ ? ఏమిటీ రెండింటిలోనూ సారూప్యత ?

సంగీతం ఇష్టపడని వాళ్ళుండరు. కానీ సంగీతం పలికించాలంటే కొన్ని వాయిద్యాలు కావలసి ఉంటుంది. వీణ, సితార, మృదంగం, హార్మోనియమ్ వగైరా వగైరా. అయితే అవన్నీ బోలెడంత ఖరీదు పలుకుతాయి. సామాన్య మానవుడు కొని సాధన చేయలేడు. సంగీతం మీద అభిరుచి ఉంటే సరిపోదు. వాయిద్యాల్ని కొనుక్కునే స్తోమత కూడా ఉండాలి.





కానీ పిల్లన గ్రోవి విషయంలో అలా కాదు. ఐదు రూపాయిలతో కూడా ఒక పిల్లన గ్రోవిని కొనుక్కోవచ్చు. అలాగని అంత చవక అయినా దానినుంచి వచ్చే సంగీతం కూడా చవకబారుగానే ఉంటుందనుకుంటే మాత్రం పొరపాటే. ఏ యితర వాయిద్యానికీ తీసిపోనంత అద్భుతమైన సంగీతం పిల్లనగ్రోవినుంచి కూడా వస్తుంది. ఒక చిన్న వెదురు గొట్టం మీద ఉన్న ఆరు కన్నాలు అంత మహాద్భుతమైన సంగీతాన్ని ఎలా సృష్టించగలుగుతున్నాయని ఆలోచిస్తే ఆశ్చర్యం కలగక మానదు.

అలాగే ఆటలు అంటే ఇష్ట పడని వాళ్ళు కూడా ఉండరు. క్రికెట్, గోల్ఫ్, ఫుట్ బాల్, టెన్నిస్, వాలీ బాల్, బేస్ బాల్ వగైరా వగైరా. కానీ ఇవన్నీ ఆడాలంటే ఎంతో ఖరీదైన ఆటవస్తువులు కొనుక్కోవాలి. వేలకు వేలు ఖర్చు చేయాలి. పైగా టీమ్ కావాలి. కానీ చదరంగం అలా కాదు. పాతిక రూపాయిల ఖర్చుతో ఒక చదరంగం బల్ల, పావులు దొరుకుతాయి. ఆడడానికి ఇద్దరున్నా చాలు. గట్టిగా మాట్లాడితే ఒక్కడే చాలు. అవతలి వాడి ఎత్తులు జిత్తులు ఊహిస్తూ తానే వేస్తూ కూడా ఆడుకోవచ్చు. లేదా ప్రసిద్ధ ఆటగాళ్ళ ఎత్తులు వ్రాయబడి ఉన్న పుస్తకాలు ముందు ఉంచుకుని ఆడుకోవచ్చు. అరవై నాలుగు గళ్ళు, ముప్పై రెండు పావులతో ఎన్ని కోట్ల వేరియేషన్స్ వస్తాయి ? ఎన్నెన్ని కళ్ళు చెదిరేలాంటి జిత్తులు కనిపిస్తుంటాయి ? అంత అద్భుతమైన థ్రిల్ జస్ట్ పాతిక రూపాయిలతోనే దొరుకుతుందంటే ఆశ్చర్యంగా లేదూ ?

అందుకే ఆ రెండూ అంటే నాకెంతో ఇష్టం. అతి తక్కువ ఖర్చుతో అనంతమైన ఆనందాన్నిచ్చే సారూప్యత వాటిలో ఉంది.

అలాంటిదే మరో అపురూపమైన వస్తువు ఒకటుంది. అదేమిటో తెలుసా ? మన ముఖం మీద చిరునవ్వు. కొందరు నవ్వితే పూలు విరబూసినట్టుంటుంది. వెన్నెల కాసినట్టుంది. ఇంద్రధనుస్సు వెల్లివిరిసినట్టుంది. అయితే దానికి ఖర్చేం లేదు. ప్రయోజనం మాత్రం అనంతం.





ఒక చిన్న చిరునవ్వుతో వందేళ్ళ శత్రుత్వాన్ని రూప మాపవచ్చు. ఒక చిన్న చిరునవ్వుతో ప్రపంచ యుద్ధాన్ని నివారించ వచ్చు. ఒక చిన్న చిరునవ్వుతో వెయ్యికోట్ల విలువ చేసే బిజినెస్ డీల్‌ని విజయవంతం చేయవచ్చు.

చిరునవ్వుకున్న ఆ అద్భుతమైన శక్తిని మనం ఎందుకు పొదుపుగా వాడుకుంటున్నామో అర్థం కాదు. కొందరిని చూస్తే ముఖం ముటముటలాడుతూ ఉంటుంది. ఎందుకలా ? సమాధానం లేదు. మరి కొందరిని చూస్తే ముఖం ఆముదం తాగిన వాడిలా ఉంటుంది. ఎందుకలా ? సమాధానం లేదు. కొందరిని నవ్వుతో పలకరించినా, చిరాకుగా చూసి నిరాసక్తంగా సమాధానమిచ్చి ఊరుకుంటారు కానీ నవ్వడానికి ప్రయత్నం కూడా చేయరు. నవ్వితే ఎక్కడ ముత్యాలు రాలి పడతాయో అన్నట్టుంటుంది వాళ్ళ ధోరణి.



నవ్వు నాలుగు విధాల చేటు. అనే వాళ్ళు ఒకప్పుడు. కానీ ఆ సామెత పాతబడిపోయింది అన్న మాట కూడా పాతదే. నవ్వు నాలుగందాల స్వీటు అని డిక్లేర్ చేసి చాలా కాలమైంది.

నవ్వు మన శరీరంలోని నరనరాల్లోనూ ఉత్తేజాన్ని నింపి ఆరోగ్యాన్ని కాపాడుతుందని తెలియని వాళ్ళెవ్వరూ ఉండరు. కానీ నవ్వడానికెందుకో సంకోచిస్తారు కొందరు. నవ్వు నవ్విన వాళ్ళ ఆరోగ్యాన్నే కాదు, ఎదుటి వాళ్ళ ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుంది. చూడ్డానికి ఆహ్లాదకరంగా ఉంటుంది కాబట్టి.

నవ్వమంటే ఫకాలుమని నవ్వే వాళ్ళు కొందరుంటారు. వికటాట్టహాసం చేసేవాళ్ళు మరికొందరుంటారు. వెకిలిగా నవ్వే వాళ్ళ సంగతి సరేసరి. అవన్నీ ఆరోగ్యకరమైన నవ్వులు కాదు. నవ్వంటే సన్నజాజి పూవులాంటి సన్నని చిరునవ్వు. గుండె గదిలో ప్రారంభమై పెదాలమీంచి పెల్లుబికే పన్నీటిలాంటి దరహాసం. చూడగానే ఆత్మీయమైన పులకరింత కలగజేసే అత్యంత మధురమైన కేరింత. అదీ నవ్వంటే.

నవ్వుకి మరో పేరు నరకాన్నుంచి స్వర్గానికి మోసుకుపోయే పల్లకి. మనసారా నవ్వండి. లాభమే కానీ నష్టం లేదు. నా మాట నమ్మండి.